లబ్ధిదారులు వివరాలు ఇవ్వాలి

- జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్
- ప్రజా పాలన దరఖాస్తుల పరిశీలన

పెద్దవంగర : ప్రజాపాలనలో అభయహస్తం పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తమ వివరాలను అధికారులకు ఇవ్వాలని జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ తెలిపారు. గురువారం మండలంలో పలు గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డితో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా మహాలక్ష్మి పథకం పంపిణీకి కసరత్తు చేస్తోందని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్లను అర్హులకే అందేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దరఖాస్తు వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేసి అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తున్నట్లు చెప్పారు. 9,523 దరఖాస్తులు రాగా 3,180 దరఖాస్తులు సరైనవిగా గుర్తించామని ఎంపీడీఓ తెలిపారు. ఇప్పటి వరకు 579 దరఖాస్తులను పరిశీలించామన్నారు. ఆయా గ్రామాల కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అర్హులకు గృహజ్యోతి పథకం అమలు చేయాలి

గార్ల : మండలంలో అర్హులైన లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం అమలయ్యేలా విద్యుత్ అధికారులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్ కోరారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకం అమలులో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహించి కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో జిల్లా నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి, ఆడెపు వెంకటేశ్వర్లు, కోల కుమార్ గౌడ్, పి వీరస్వామి, బి నరసింహారావు, జయరాజ్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకం అర్హులైన లబ్ధిదారులు తమ ఆధారాలను స్థానిక సబ్‌స్టేషన్‌లో అందజేయాలని విద్యుత్ ఏఈ మహేంద్రబాబు సూచించారు. గురువారం జీపీ కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారుల నుంచి ఆయన సంబంధిత పత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.


పెద్దవంగర: వివరాల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న సయ్యద్ ఖుర్షీద్, అధికారులు

దామ్యతండాలో..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని దామ్యతండా గ్రామంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ భగవాన్ రెడ్డి గురువారం ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా గ్యాస్ సబ్సిడీ కోసం ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలు ఇచ్చిన దరఖాస్తుల్లో వివరాలు సరిగా నమోదు చేయని వారి ఇంటికి వెళ్లి వారివద్ద గల గ్యాస్ బుక్ వివరాలను సేకరించారు. దరఖాస్తుదారులు అందజేసిన సమయంలో కొంతమంది వాటిల్లో తప్పులు నమోదు చేయగా అధికారులు వాటిని పరిశీలించి సరిచేస్తున్నారు. వాటిని రికార్డుల్లో నమోదు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ భగవాన్ రెడ్డి తెలిపారు.

దరఖాస్తుల పరిశీలన

నర్సింహులపేట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో భాగంగా రూ.500లకు గ్యాస్ సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను గురువారం అధికారులు ఇంటింటికి వెళ్లి పరిశీలిస్తున్నారు. బుక్ నంబర్, ఆధార్, మొబైల్ నంబర్‌లను సరిచేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్లు, గ్రామ పంచాయతీ అధికారులు తప్పుగా ఉన్న దరఖాస్తులను సరి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ భారతీ, ఎంపీఓ సోమ్‌లాల్, ఇన్‌చార్జీ ఏఈఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


గార్ల: సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణగౌడ్

కురవిలో..

కురవి : కురవి, సీరోలు మండలాల్లోని ఆయా గ్రామాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజాపాలన యాప్ బృందం సభ్యులు గురువారం పర్యటించారు. గ్యాస్ కనెక్షన్ నంబర్ తప్పుగా ఉన్నవారి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించి ప్రజా పాలన యాప్‌లో మళ్లీ నమోదు చేశారు. కురవి మండలం తట్టుపల్లిలో మండల స్పెషల్ అధికారి నరసింహస్వామి, ఎంపీడీఓ సరస్వతీ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.


మహబూబాబాద్ రూరల్ : దామ్యతండాలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్


కురవి: తట్టుపల్లిలో..


గార్ల పంచాయతీ కార్యాలయంలో..


నర్సింహులపేట: ముంగిమడుగులో..

నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్


నిరుపయోగంగా ఉన్న నీటి శుద్ధియంత్రం

గార్ల : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మూడేళ్ల నుంచి తాగునీటి శుద్ధియంత్రం నిరుపయోగంగా మారిందని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఉషారాణి తెలిపారు. దీంతో విద్యార్థులకు బయటి నుంచి వాటర్ క్యాన్లు కొనుగోలు చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి శుద్ధి యంత్రానికి మరమ్మతు చేపట్టి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

ఉత్తమ బోధన అభినందనీయం

- జిల్లా సంక్షేమ అధికారి వరలక్ష్మి


విద్యార్థులతో మాట్లాడుతున్న వరలక్ష్మి

మహబూబాబాద్ రూరల్ : విద్యార్థులకు ఉత్తమ బోధన అభినందనీయమని జిల్లా సంక్షేమ అధికారి వరలక్ష్మి అన్నారు. మండలంలోని అయోధ్య గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని వరలక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల ఉత్తమ బోధనతో విద్యార్థులను తీర్చిదిద్దే తీరు చాలాబాగుందని మెచ్చుకున్నారు. వారికి నిర్ణీత సమయంలో అందుతున్న పోషకాహార పదార్థాల మెనూను తనిఖీ చేసి సిబ్బంది పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల చైల్డ్ ఆఫీసర్ వాహిని, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



నెహ్రూసెంటర్ : జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సామాజిక సంఘం కేవీపీఎస్ డైరీని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అంబరీష గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. సమాజంలో ఉన్న వివక్షను తొలగించేందుకు, మార్పు కోసం మహనీయులు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. సమస్యలపై కేవీపీఎస్ చేపడుతున్న ఉద్యమాలను అభినందించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోత్ కిషన్ నాయక్, గుగ్గిళ్ళ పీరయ్య, ఐలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మహాసభల పోస్టర్..



మహబూబాబాద్ అర్బన్ : ఈ నెల 11, 12వ తేదీల్లో ఖమ్మం జిల్లాలో తలపెట్టిన టీపీటీఎఫ్ ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బలాష్టి రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో గురువారం మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. రాచకొండ ఉపేందర్, విద్యాసాగర్, శ్రీనివాస్, గిరిజ, వసంత, సత్యవతి, శైలజ, శ్రీలత, వసంత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

స్టోన్‌క్రషర్ మిల్లు పరిశీలన

కేసముద్రం : మండలంలోని అర్పనపల్లి సమీపంలో గల సద్గురు స్టోన్ క్రషర్ మిల్లును తహసీల్దార్ దామోదర్, సర్వేయర్ శ్రావణ్, ఇరిగేషన్ శాఖ ఏఈ సాయితేజ గురువారం పరిశీలించారు. క్రషర్ పక్కనే ఉన్న మన్నెకుంట చెరువు శిఖాన్ని మిల్లు యాజమాన్యం ఆక్రమించారని, ఇదే గ్రామానికి చెందిన భరత్ ఇటీవల గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. కాగా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్‌తోపాటు సంబంధిత అధికారులు క్రషర్ మిల్లును సందర్శించి, చెరువుశిఖాన్ని పరిశీలించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించి, తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

మాజీ సర్పంచ్‌లకు సన్మానం



నెల్లికుదురు : ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు అందించిన సేవలు మరువలేనివని ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడారు. అనంతరం మాజీ సర్పంచ్‌లను శాలువాలతో సన్మానించి మెమొంటోలు అందజేశారు. ఎంపీడీఓ శేశాద్రి, ఎంపీఓ పార్థసారధి, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పద్మశ్రీ గ్రహీతకు..

దోర్నకల్ : ఇటీవల పద్మశ్రీ పురస్కారం అందుకున్న కేలోత్ సోమ్‌లాల్‌ను చాప్లాతండా వాసులు ఘనంగా సన్మానించారు. సాహితీ విద్యా రంగంలో విశేష సేవలదించి భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించి ఇటీవల పద్మశ్రీ పురస్కారం అందుకున్న కేలోత్ సోమ్‌లాల్‌ను గురువారం హబ్సీగూడలోని ఆయన ఇంట్లో చాప్లాతండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు గుగులోత్ సేట్రామ్, కోటి తదితరులు కలిసి ఘనంగా సన్మానించారు.

అభినందన

గూడూరు : మండలంలోని అరవింద పాఠశాల విద్యార్థిని కన్న శ్రీవర్షిణి రాష్ట్రస్థాయి సైన్స్ అండ్ టెక్నాలజీ ఎగ్జిబిషన్‌లో తృతీయ బహుమతి సాధించగా గురువారం పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పింగిళి శ్రీనివాస్‌తో పాటు గైడ్ టీచర్ కన్న వెంకటేశ్వర్లు ఉన్నారు.

గోల్డ్ మెడల్ విద్యార్థినికి..



కేసముద్రం : కేసముద్రం విలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థిని మంకు శ్రీజ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించినట్లు కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ తెలిపారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో శ్రీజను ఉపాధ్యాయులు అభినందించారు. ప్రిన్సిపాల్ చిర్ర నరేష్, నవీన్‌కుమార్, పీఈటీ లక్ష్మణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి


రామచంద్రారెడ్డి (ఫైల్)

మరిపెడ రూరల్ : మండలంలోని తానంచర్ల మాజీ సర్పంచ్ పాదూరి రామచంద్రారెడ్డి (70) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. రామచంద్రారెడ్డి మృతదేహాన్ని పలువురు సందర్శించిన నివాళులర్పించారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్

నెహ్రూసెంటర్ : గిరిజనుల అభివృద్ధికి సరిపడ నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జగన్నాథభవన్‌లో సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంనాయక్ మాట్లాడారు. ఆదివాసీ గిరిజనులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న లక్షలాది ఎకరాల పోడు భూములను బలవంతంగా లాక్కొని కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అధికారికంగా సేవాలాల్ మహారాజ్ జయంతి రోజు సెలవు దినంగా ప్రకటిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. జయంతి వేడుకలకు రూ.20 కోట్ల నిధులు విడుదల చేస్తూ అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాంనాయక్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గిరిజనులు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక..

తెలంగాణ గిరిజన సంఘం మహబూబాబాద్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శ్రీరాంనాయక్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా బానోత్ వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా భూక్య హరినాయక్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులుగా మాలోత్ కిషన్‌నాయక్, బానోత్ సీతారాం, మాలోత్ శాంతికుమార్, గుగులోత్ సుధాకర్, 26 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


దోర్నకల్: పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది


తొర్రూరు రూరల్: అమ్మాపురంలో..

తొర్రూరు రూరల్ : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అమ్మాపురం స్పెషల్ ఆఫీసర్ తుమ్మ వెంకటేశ్వర్లుతోపాటు ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ రెండో రోజు ప్రత్యేక పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్లు మాట్లాడుతూ వేసవిలో ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని, తీవ్ర ఎండ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీటీసీలు, జీపీ కార్యదర్శులు, కారోబార్స్, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

దోర్నకల్ : ప్రత్యేక పారిశుద్ధ్య పనులు గురువారం రెండో రోజు గ్రామాల్లో కొనసాగాయి. వెన్నారంతో పాటు పలు గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బంది వీధులను శుభ్రం చేశారు. రోడ్లకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి గడ్డిమందు పిచికారీ చేశారు.

'డిప్యుటేషన్ల రద్దు తగదు'

గార్ల : గార్ల సీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్లు, స్టాఫ్‌నర్సుల డిప్యుటేషన్ రద్దు చేసి వారిని జిల్లా ఆస్పత్రికి కేటాయించడం సరికాదని సీహెచ్‌సీ ఎదుట సీపీఎం నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. ఏడాది క్రితమే ఈ ఆస్పత్రిని వైద్య విధాన పరిషత్‌లోకి అప్‌గ్రేడ్ చేసి, 10 మంది వైద్యులను డిప్యుటేషన్‌పై నియమించిందన్నారు. కొత్త ప్రభుత్వం వైద్యశాఖలో డిప్యుటేషన్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో వైద్యులు, సిబ్బంది మళ్లీ జిల్లా ఆస్పత్రిల్లో విధుల్లో చేరారన్నారు. ఇక గార్ల ఆస్పత్రిలో ఎప్పటిలాగే ఏకైక డాక్టర్, ఇద్దరు స్టాఫ్‌నర్సులు మాత్రమే విధులు నిర్వర్తిస్తుండటంతో మండల ప్రజలకు వైద్యసేవలు అందించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో నాయకులు ఇమ్మడి గోవింద్, బాగం లోకేశ్వరరావు, బి ఉపేందర్‌రెడ్డి, నాగరాజు, వీరభద్రం, మల్లయ్య, రమేష్, వెంకటేశ్వర్లు, సర్వర్, కోటయ్య, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


సీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

మరిపెడ : ఈనెల 16న తలపెట్టిన సార్వత్రిక సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో అంగన్‌వాడీలు పాల్గొని విజయవంతం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పట్టణ కేంద్రంలోని సీడీపీఓ శిరీషకు వినతిపత్రం అందజేశారు. కుమ్మరికుంట్ల జ్యోతి, ప్రచార కార్యదర్శి మంగమ్మ, లీలాబాయి, గుమ్మడి కళమ్మ, ఉమారాణి, స్వర్ణ, రాములమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో కార్మికులు కదం తొక్కాలి

నెహ్రూసెంటర్ : ఈ నెల 16వ తేదీన తలపెట్టిన గ్రామీణ భారత్‌బంద్‌లో కార్మికులు, కర్షకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సమ్మె పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంద శంకర్, వీరవెల్లి రవి, వరిపెల్లి వెంకన్న, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, పుచ్చకాయల రమణ, సత్రం, బి.రాము, రాంబాబు, బాలు తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ పాలనకు చమరగీతం పాడాలి

దోర్నకల్ : రాబోయే ఎన్నికల్లో మతతత్వ పార్టీలకు చమరగీతం పాడాలని రౌండ్ టేబుల్ సమావేశం అభిప్రాయపడింది. స్థానిక అశోక్‌భవన్‌లో గురువారం ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ వివిధ పార్టీల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ దోర్నకల్‌లో 12న బైక్ ర్యాలీ, 14న ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

డోర్నకల్ : మండలంలోని చాప్లాతండాలో సేవాలాల్ సేన ప్రచార కరపత్రాన్ని కేరళ ఐఏఎస్ అధికారి గుగులోత్ లక్ష్మణ్‌నాయక్ గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 15న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాన్ని లక్ష్మణ్‌నాయక్ ఆవిష్కరించారు. సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు భూక్యా బాలునాయక్ మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను పురస్కరించుకుని భోగ్ బండారో, మహా అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆదివాసీలకే కేటాయించాలి

గూడూరు : పార్లమెంట్ ఎన్నికల్లో రిజర్వ్ స్థానాలను ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ దాట్ల నాగేశ్వర్‌రావు, జేఏసీ కన్వీనర్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

రైతు రుణవిముక్తి చట్టం ఏర్పాటు చేయాలి

నెహ్రూసెంటర్ : రైతు రుణవిముక్తి, మద్దతు ధర చట్టాలను ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ రైతు పోరాటంలో మృతి చెందిన రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.

'సీపీఐ జోక్యం చేసుకోదు'

నెహ్రూసెంటర్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పాలక మండలి మార్పులు, చేర్పులు బీఆర్ఎస్ అంతర్గత వ్యవహారంలో సీపీఐ జోక్యం చేసుకోబోదని ఆ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి అన్నారు. సీపీఐ పేదల పక్షపాతిగా ఉంటుందని, పేదల సంక్షేమం కోసం పాటుపడే వారికే తమ మద్దతు అని గురువారం ప్రకటనలో తెలిపారు.

గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం

కేసముద్రం : ఇనుగుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో పీహెచ్‌సీ వైద్యులు గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఎనిమియా ముక్తభారత్‌లో భాగంగా విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు శివరాం, సునీల్, సుమలత, ప్రిన్సిపాల్ భాగ్యం, వైస్ ప్రిన్సిపాల్ వెంకయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెజారిటీ స్థానాలు గెలవడం ఖాయం

దంతాలపల్లి : తెలంగాణ రాష్ట్రంలో మెజారిటీ పార్లమెంట్ స్థానాలు గెలవడం ఖాయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ సంక్షేమ పథకాలతో కేంద్రంలో మళ్లీ బీజేపీ సర్కార్ భారీ మెజారిటీతో సుమారు 400 పార్లమెంట్ స్థానాలతో అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సందెల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అల్లం సాయికుమార్, ప్రధాన కార్యదర్శి దాసరి మురళి, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు రాణి రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలి

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని ముడుపుగల్ ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని సీపీఐ మండల కార్యదర్శి తండ సందీప్ డిమాండ్ చేశారు. పాఠశాల విద్యార్థులతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడారు. మరుగుదొడ్ల నిర్మాణం కాకపోవడంతో ఇక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులు భోజనం కూడా చేయకుండా పరీక్షలను బంద్ చేసి నిరసనలో కూర్చున్నారు. డీఈఓ రామారావు స్పందించి తక్షణమే పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వగా ధర్నా విరమించారు.


ధర్నా చేస్తున్న విద్యార్థులు, తండ సందీప్

సంక్షిప్త సమాచారం

నేటినుంచి కబడ్డీ పోటీలు

బయ్యారం : మండలంలోని గురిమెళ్లలో నేటినుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ప్రకటనలో తెలిపారు. పురుషులతో పాటు మహిళలకు వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు 93981 83204, 78158 34114 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బీజేపీ నిరంకుశ విధానం నశించాలి

గార్ల : కేరళలో సీపీఎం ప్రభుత్వంపై బీజేపీ అవలంభిస్తున్న నిరంకుశ విధానం నశించాలని కోరుతూ గురువారం గార్ల నెహ్రూసెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాసరావు, బి.లోకేశ్వరరావు, గోవింద్, ఉపేందర్‌రెడ్డి, మౌలానా, వీరభద్రం, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'ఆల్బెండజోల్' మాత్రలు ఇవ్వాలి

మరిపెడ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికి వెళ్లి 19ఏళ్ల లోపు చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని తొర్రూర్ ఆర్డీఓ నర్సింహరావు ఆదేశించారు. మరిపెడ మున్సిపాలిటీలో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ నెల 12న నులిపురుగు నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

షబ్బీర్ అలీని కలిసిన మైనార్టీ నాయకులు

మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ (ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ) సలహాదారుడు, మాజీ మంత్రి షబ్బీర్ అలీని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా ముస్లిం నాయకులు గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మహబూబాబాద్ జిల్లాలో ముస్లింలకు గల పలు సమస్యలను షబ్బీర్ అలీ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యేతో పాటు మహబూబాబాద్ జిల్లా మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ ఖలీల్, మహమ్మద్ నదీమ్ అలీ ఖాన్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ నజీర్, జాకీర్ హుస్సేన్, హకీమ్, సభ్యులు తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ కమిటీ ఎన్నిక

చిన్నగూడూరు : మండలంలోని పగిడిపల్లిలో గురువారం ఇందిరమ్మ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నూకల రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు స్వాగతం

కొత్తగూడ : మండలంలోని ఎదళ్లపల్లికి చెందిన చల్లమల్ల రాజు భారత సైన్యంలో విధులు నిర్వహించి పదవీ విరమణ అనంతరం గ్రామానికి రాగా స్థానికులు ఘన స్వాగతం పలికారు. దేశ రక్షణలో కార్గిల్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొని స్వగ్రామానికి వస్తుండటంతో స్థానికులు ఆయనను సన్మానించారు. మండలకేంద్రం నుంచి జాతీయ జెండాలతో ఊరేగింపుగా ఎదుళ్లపల్లి వరకు తీసుకువెళ్లారు. కాగా రాజు మండలకేంద్రంలో తన ఉపాధ్యాయుడు మల్లెల సారయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళిర్పించాడు.

బైపాస్ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

కేసముద్రం : కేసముద్రం స్టేషన్‌లో బైపాస్ రోడ్డు అధ్వానంగా మారిందని, వెంటనే సంబంధిత అధికారులు మరమ్మతు పనులు చేపట్టాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ గురువారం డిమాండ్ చేశారు. తారురోడ్డు పనుల్లో నాణ్యత లేకపోవడం, ఓవర్‌లోడ్ వాహనాలతో గుంతలమయంగా మారిందన్నారు.


చర్య తీసుకోవాలి

మరిపెడ రూరల్ : గూడూరు మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన ధరావత్ స్వామి ఆధార్ కార్డు లింకు పేరుతో తన వద్ద రూ.15 వేలు తీసుకొని మోసం చేశాడని మండలంలోని స్టేజితండా పరిధి కుడియాతండాకు చెందిన దివ్యాంగుడు జాటోత్ బిచ్యా గురువారం ఆరోపించాడు. అతనిపై చర్య తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

గుడుంబా స్థావరంపై పోలీసుల దాడి

గార్ల : మండలంలోని మర్రిగూడెం పంచాయతీ గ్యామాతండాలో గుడుంబా స్థావరంపై పోలీసులు పక్కా సమాచారం మేరకు దాడి చేసి 8 లీటర్ల నాటుసారా, 100 లీటర్ల బెల్లం పానకం పట్టుకొని నిందితుడు మాలోత్ శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ గురువారం తెలిపారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ జయరాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బలరాం నాయక్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలి



నెల్లికుదురు : అభివృద్ధి ప్రదాత, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్‌కు మహబూబాబాద్ ఎంపీ టికెట్ కేటాయిస్తే అధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ సింగ్ నాయక్ కాంగ్రెస్ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌హెచ్‌పీఎస్ తరఫున బలరాం నాయక్‌కు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు హెచ్ వెంకటేశ్వర్లు, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉదయ్ సింగ్ నాయక్, నవీన్ నాయక్, దేవిసింగ్ నాయక్, గిరి నాయక్, యాకూబ్ నాయక్, స్థానిక నాయకులు మోహేందర్, తూళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.